# సెల్‌ఫోన్ రిపేర్ ఉచిత శిక్షణ

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

రూడ్‌సెట్ నందు మార్చి 11 నుండి సెల్‌ఫోన్ రిపేర్ ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువకులు శిక్షణకు అర్హులని, నెల రోజుల శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించబడునని తెలిపారు. ఆసక్తిగల వారు 9573363141 సెల్ నంబర్ సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

# అర్హులకు రుణాలు మంజూరు అయితేనే...

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

ఆర్థికంగా వెనుకబడిన కులాలకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించగా, నిజమైన లబ్దిదారులకు రుణాలు మంజూరు అవుతాయా అన్న చర్చ మొదలైంది. ఇదే విషయమై పౌరసమాజం కన్వీనర్ జి.నరసింహారావు మీడియాతో మాట్లాడుతూ రుణాల మంజూరులో రాజకీయ జోక్యం తగదని, ప్రజలలో అపోహలు పోయేలా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. పారదర్శకంగా రుణాలు మంజూరు కాకపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత ఖాయమని, పార్టీ నేతల అత్యుత్సాహంపై అధికార పక్షం అప్రమత్తం కావాలన్నారు. అనర్హులకు రుణాలు మంజూరైతే జనం సహించబోరని, ప్రజాప్రతినిధులను నడిరోడ్డుపై ప్రశ్నించడం ఖాయం అన్నారు.

# విద్యార్థుల భద్రత పట్టించుకోరా - ఎఐఎస్ఎఫ్ నేతల ఆగ్రహం

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**



టంగుటూరు గురుకుల పాఠశాలలో విద్యార్థి శరీరంపై వేడి పాలు పడటంతో గాయాలు అయ్యాయి. స్థానిక కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కళ్యాణ్, రామ్‌జీ పరామర్శించారు. సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ప్రమాదాల బారినపడటం తల్లిదండ్రులను కలవర పరుస్తోందని, విద్యార్థుల భద్రత విషయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

# ట్రంప్ విధానాలపై చర్చా కార్యక్రమం

**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

ఆసరా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ట్రంప్ ఫాసిస్ట్ విధానాలు-భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చా కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు బుడ్డిగ జమిందార్, గౌరవ అతిథిగా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొంటారని, అభ్యుదయ, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 4వ రోజు జ్ఞాన జ్యోతి అవగాహన సదస్సు

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన నాగులుప్పలపాడుతో పాటు ఉప్పుగుండూరు గ్రామాలలో రెండు చోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలకు నాల్గో రోజున జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై చిన్నారులకు చదవడం రాయించడం వారికి అర్థమయ్యే రీతిలో చెప్పడంపై బీఆర్పీలు ఉషారాణి, ప్రమీల, ఎంఈఓ రవి, ప్రధానోపాధ్యాయులు, కార్యకర్తలు అవగాహన కల్పించారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు


**టంగుటూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 18 తేదీ నుండి 23 వ తేదీ వరకు క్లాసులు నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ బడికి వచ్చే విధంగా చూడాలని బొమ్మలు వేయడం పిల్లలకు నేర్పించడం చదువు పట్ల ఆసక్తి కలిగిలా ఉండేలాగా చూడాలని సీడీపీఓ అన్నారు. అదే విధంగా పిల్లల్ని ఆధార్ ఇప్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.జ్యోతి, ట్రైనింగ్ ఆఫీసర్ రాము, కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి, డీఆర్సీ పాల్గొన్నారు.

# గాయపడిన గురుకుల విద్యార్థికి రూ.2లక్షలు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించిన మంత్రి డోలా

**టంగుటూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**



గాయపడిన గురుకుల విద్యార్థికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి రూ.2లక్షలు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించారు. రెండు రోజుల క్రితం వేడిపాలు మీద పడి టంగుటూరు జ్యోతిబాపూలే గురుకుల 5వ తరగతి విద్యార్థి మధుమోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో విద్యార్థిని పరామర్శించిన మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సీఎంఆర్ఎఫ్ నిధులతో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన మరుసటి రోజే ముఖ్యమంత్రి కార్యాలయం తో మాట్లాడి మంత్రి రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈఎల్ఓసీని విద్యార్థి తల్లిదండ్రులు శనివారం నాడు ఆసుపత్రి యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యం చేయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫిబ్రవరి 23న న్యూలైఫ్ విద్యార్థుల ప్రార్థన సమావేశం

**టంగుటూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**




టంగుటూరు మండలం గ్రామం పాకల రోడ్డులోని న్యూ లైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరం ప్రాంగణంలో న్యూలైఫ్ హోలి మినిస్ట్రీస్ వారు నిర్వహిస్తున్న న్యూ లైఫ్ స్టూడెంట్స్ ప్రేయర్ మీట్‌లో విద్యార్థులు పాల్గొనాలని మినిస్ట్రీస్ అధినేత రెవ డాక్టర్ సుదర్శన్ బాబు తెలిపారు. అనేక సంవత్సరాలుగా ఈ విద్యార్థిల ప్రార్థన సమావేశాల్ని నిర్వహిస్తున్నారు. ప్రోత్సాహక సందేశాలను, బహుమానాలను, అద్భుతమైన సాక్ష్యాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని పరీక్షలు రాయబోవువారు ఉపయోగించుకోవాలన్నారు.

# మానవత్వం చాటుకున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**- కాలువ ప్రమాదంలో కొట్టుకుపోయిన యువకుని వెంటనే వెలికి తీయాలని సంబంధిత పోలీసు, ఫైర్ అధికారులకు, రిస్క్ టీంకు ఆదేశాలు**

**దర్శి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**



ఓ శుభకార్యానికి వెళ్తూ.. జరిగిన ఈ విషాధ ఘటనను చలించిన డాక్టర్ లక్ష్మి.. వెంటనే కారు దిగి బాధితులను అడిగి వివరాలు తెలుసుకొని వారినిఓదార్చారు. వెంటనే కాలువలో కొట్టుకుపోయిన యువకుని మృతదేహాన్ని వెలికి తీసేందుకు చర్యలు తీసుకోవాలని కోరడం మరోసారి దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఔదార్యం చూశాం అని అక్కడి ప్రజలు మాట్లాడుకున్నారు. దర్శి నుండి కురిచేడు వెళ్తున్న గొట్టిపాటి లక్ష్మి కురిచేడు రోడ్డులోని సాగర్ కెనాల్ వద్ద దర్శి మండలం, వెంకటాచలంపల్లి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన 17 సంవత్సరాల పుప్పాల వీరనారాయణ అనే వ్యక్తి ప్రమాదవ శాత్తు కాలువలో పడిపోగా అటుగా వెళ్తున్న దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అక్కడ గుమ్మి కుడి ఉన్న ప్రజలను చూసి ఆగి విషయం తెలుసుకొని వెంటనే దర్శి డీఎస్పీ లక్ష్మినారా యణని, దర్శి ఎస్సై మురళిని ఫోన్‌లో సంప్రదించి గజ ఈతగాళ్ళను పిలిపించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా యువకుడి ఆచూకి తెలియజేయాలని ఆదేశించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## బాధిత షాపు యజమానులకు చుండూరి పరామర్శ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు 9వ డివిజన్‌లో ఎఫ్‌సీఐ ఎదురుగా ఉన్న షాపులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చి వేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, కార్పొరేటర్ మమమ్మద్ ఇమ్రాన్ ఖాన్ బాధిత షాప్ యజమానులను పరామర్శించి వారికి న్యాయపరంగా అన్ని విధాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ అధ్యక్షుడు పూర్ణ, వెంకటరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ కమ్మ సురేష్, సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, ఒంగోలు యూత్ ప్రెసిడెంట్ మల్లిశెట్టి దేవ, 9వ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి

**- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా**







**ఒంగోలు, ప్రభాతవార్త**

భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తేల్చి చెప్పారు. చట్టానికి ఎవరు అతీతం కాదని స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బి.చిన్న ఓబులేసులతో కలిసి రెవెన్యూ అధికారులతో ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రీ సర్వే, ఆర్‌ఓఆర్ కేసులు, రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్ కార్యక్రమాలలో వచ్చిన రెవెన్యూ సంబంధిత అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా విషయాలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఎన్నికలు, ప్రకృతి విపత్తుల సమయాలలో రెవెన్యూ సిబ్బంది చిత్తశుద్ధి, అంకితభావం, సమర్థవంతంగా పని చేస్తారనే గర్తింపు ఉందన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో కూడా అదే విధంగా పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ ప్రతిష్ఠ కోల్పోయేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించబోనన్నారు. ముఖ్యంగా గ్రీవెన్స్ కార్యక్రమాలలో వస్తున్న అర్జీలలో 60 శాతం వరకు రెవెన్యూ సంబంధిత సమస్యలనే ప్రజలు ప్రస్తావిస్తున్నారన్నారు. పరిష్కరించదగిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని సమస్యలైతే అదే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని దిశానిర్ధేశం చేశారు. సహేతుకంగా పరిష్కరించడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై తహాశీల్దార్‌కు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. కేవలం వీఆర్వో నివేదికపైనే ఆధారపడకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిత్యం ఫీల్డ్‌లో ఉండేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తహాశీల్దార్ కూడా ఎల్లప్పుడూ మండల కేంద్రంలోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సర్వే శాఖలో తగినంత సిబ్బంది ఉన్నందున విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనన్నారు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న 120 డ్రోన్‌ల ద్వారా రీ సర్వే,జాయింట్ ఎల్‌పీఎంల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రైవేటు భూ యజమానులను 22(ఏ) జాబితాలో చేర్చడం ద్వారా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇలాంటి భూముల కేసులను జిల్లా స్థాయి కమిటీలో చర్చించాలని చెప్పారు. ప్రభుత్వ భూములు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండాచూడాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో ని వీఆర్వోలు ఈ విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కోర్టు కేసులు, లోక్ అదాలత్ కేసులను పర్యవేక్షిస్తూ సత్వరమే పరిష్కారమయ్యేలా అవసరమైన పిటీషన్లు సమర్పించాలని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను మార్చి మొదటి వారం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. తమరి ఆదేశాలు, సూచనల మేరకు రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని, ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తామని సిసోడియాకు తెలిపారు. ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మిప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు,రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ భాషా, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, అసిస్టెంట్ ఫారెస్టు కన్జర్వేటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహాశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు. అనంతరం ఒంగోలు నగర శివారులోని ఎన్.అగ్రహారం గ్రామంలో గతంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్ సిసోడియా పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలను జాయింట్ కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా వారి వెంట హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, తహాశీల్దార్ వాసు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**భూ ఆక్రమణలపై ఆరా:**

ఒంగోలు పరిసర ప్రాంతాలలో నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో రెండేళ్ల క్రితం వెలుగుచూసిన భూ అక్రమాలపై సిసోడియా ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ అక్రమాలపై ఇప్పటికే ప్రత్యేక బృందం(సిట్) ఏర్పడినందున ఎన్ని కేసులు నమోదు అయ్యాయి. వాటి దర్యాప్తు పురోగతి చార్జి షీటు దాఖలు, తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఈ కేసులకు సంబంధించిన స్థలాలు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, ఇతర పత్రాలను పరిశీలించి వాటికి సంబంధించిన వాస్తవ యజమానులను, డాక్యుమెంట్లను గుర్తించాలన్నారు. స్థలాలకు ఫేక్ డాక్యుమెంట్స్ ఎవరు సృష్టించారో ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సిసోడియా చెప్పారు. సిట్ పరిధిలోకి రాని కేసులను తొలగించాలని, మిగతా కేసులలో విచారణ వేగవంతం చేయాలని దిశా నిర్ధేశం చేశారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజులులోగా సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలంజనేయులు,ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, పలువురు సీఎల్‌లు, ఎమ్మార్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

**- నలుగురు నిందితులు అరెస్టు**
**- దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ**

**ముండ్లమూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**




ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామంలో నాలుగు కేజీల గంజాయి విక్రయిస్తున్నట్లు ముండ్లమూరు పోలీసులకు సమాచారం రావడంతో మండలంలోని వేంపాడు గ్రామ ఆంజనేయ స్వామి గుడి వద్ద నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.లక్ష్మి నారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శి డీఎస్పీ బి.లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ముద్దాయిలైన ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మి నారాయణ బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజు పల్లి గ్రామానికి చెందిన మొగిలి వంశీ, మార్టూరు టౌన్ నాగరాజుపల్లి రోడ్డు సంపత్ నగర్‌కు చెందిన ఉప్పు శివ, గోపి అను నలుగురు నిందితులు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు నిందితుడు లక్ష్మి నారాయణ మీద గతంలో మార్టూరు, చీరాల టౌన్, నరసరావుపేట టూ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గంజాయి కేసులు నమోదై ఉన్నాయని, ఉప్పు శివ గోపి మీద కూడా వేటపాలెం పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసు నమోదు కాబడి ఉందని. జడ శ్రీహరిపై మార్టూరు పోలీసు స్టేషన్‌లో మూడు వివిధ కేసులలో నమోదు కాబడి ఉన్నాయని, ముద్దాయిలు నలుగురు కలిసి గత కొంత కాలంగా సామర్లకోటకు చెదిన ఓ వ్యక్తి వ్ద నుండి గంజాయి కొనుగోలు చేసి బాపట్ల జిల్లాలోని బాపట్ల మార్టూరు, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తెలిసిన వ్యక్తుల ద్వారా గంజాయి అమ్మడం జరుగుతుందని తెలిపారు. దర్శి సీఐ, ముండ్లమూరు ఎస్సైలకు సమాచారం రావడంతో వారి కదలికలపై గట్టి నిఘా ఉంచి శనివారం మార్టూరు నుండి నలుగురు ముద్దాయిలు మండలంలోని ఈదర గ్రామానికి వచ్చి అక్కడ నుండి ఒంగోలు వెళ్తున్న సమయంలో మండలంలోని వేంపాడు గ్రామం జంక్షన్ వద్ద ముండ్లమూరు ఎస్సై వారి సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారని, తదుపరి దర్శి సీఐ వై.రామారావు కేసు దర్యాప్తు చేపట్టి ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద ముద్దాయిలను దర్శి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపడం జరుగుతుందని ,అంతే కాకుండా నిందితులందరూ కూడా ఒక ముఠాగా ఏర్పడి ఆర్గనైజడ్ క్రైమ్ చేస్తున్నారని వారి మీద కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సహిత చట్టం(బీఎస్ఎన్) సెక్షన్ 111 కింద కూడా ముద్దాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న దర్శి సీఐ వై.రామారావు, ముండ్లమూరు ఎస్సై వై.నాగరాజు, మండ్లమూరు హెచ్ఎస్‌సీబీ వెంకటేశ్వర్లు, సిబ్బంది మహేష్, కాశీం, ఇతర సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ లక్ష్మి నారాయణ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# నిరుపేదల భూములపై ఇసుక అక్రమదారుల కన్ను

***- గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంపై ఇసుక అక్రమదారుల కన్ను***
***- దోసుకునోళ్ళకి దోచుకున్నంత ఇసుక***
***- రెవెన్యూ, పోలీసు అధికారుల కన్ను గప్పి***
***- ప్రైవేటు సిబ్బంది ఏర్పాటు***
***- వారు సమాచారంతో హుడాయింపు***
***- పగలు పరిశీలన రాత్రుల తవ్వకాలు***
***- స్థానిక నాయకుల అండతోనే***
***- పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు***
***- నిరుపేద దళిత వర్గాలకు అన్యాయం***





**మద్దిపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాలలో రోజు రోజుకు ఇసుక అక్రమదారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. గత కొన్ని రోజుల నుంచి గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంనందు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రులు సంచరిస్తున్నట్లు, అదే క్రమంలో కొలచన కోట గ్రామం సమీపంలోని గుండ్లకమ్మ పరివాహక ప్రాంతానికి ఆనుకొని ఉన్న గిరిజనుల భూముల్లో ఇసుక అక్రమ దారుల కన్ను పడింది. మండలంలో కొంత మంది వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినటువంటి వ్యక్తులు అధికార పార్టీ నాయకుల అండదండలతో కొద్ది రోజుల నుంచి జాతీయ రహదారి నుంచి గుళ్ళాపల్లి గ్రామం వైపు వచ్చే రోడ్డుకు ఆనుకొని ఉన్న గుండ్లకమ్మ నదిలో రోడ్లు ఏర్పాటు చేసుకున్నారు. కొలచనకోట గుండ్లకమ్మ నది ప్రాంతానికి అనుకొని ఉన్న గిరిజనుల భూములలో ఉన్న నాణ్యమైన ఇసుకపై కన్ను పడింది. 1988 లో కొలచనకోట ఎస్టీ కాలనీ వాసులకుఒక్కొక్కరికి 0.60 సెంట్లు చొప్పున సర్వే నంబర్ 231లో సాగు చేసుకునేందుకు ఆనాటి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయడం జరిగింది. ఆ భూములు కానుకొని హిందువులకు, హరిజనులకు, గిరిజనులకు స్మశాన వాటికి కింద కొంత భూమిని కేటాయించడం జరిగింది. అదే క్రమంలో గుండ్లపల్లి పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించే 133 కేవీ విద్యుత్‌లైన్, వ్యవసాయ భూములకు విద్యుత్‌ను అందించే 133 కేవీ విద్యుత్ లైన్ ఉన్నాయి. ఈ తవ్వకాలు జరిపినట్లయితే ఒంగోలు నుంచి గుళ్ళాపల్లి పారిశ్రామికులకు విద్యుత్‌ను అందించే 133 కేవీపోల్స్ పడిపోయే పరిస్థితి. దీంతో జిల్లాలోనే పేరు పొందినటువంటి గుండ్లపల్లి పారిశ్రామిక వాడ అంధకారం అవుతుంది. మరొక 33కేవీ విద్యుత్ లైన్ స్తంభాల కూలిపోతే గ్రామ సమీపంలో వ్యవసాయ భూములకు విద్యుత్ అందని పరిస్థితి. దీంతో పాటుగా గుళ్ళాపల్లి గ్రామంలోని పలు కాలనీలకు విద్యుత్ అంతరాయం. గతంలో అనగా 2023 ఆగష్టు నెలలో కొలచనకోట గ్రామస్తులు ఈ సమస్యపై జనసేన పార్టీ నాయకులకు తెలియపరచగా ఆనాడు జనసేన పార్టీ వారి అండగా నిలిచి ఇసుక అక్రమ దారుల ఆగడాలపై పోరాటం చేయడంతో పోలీసు రెవెన్యూ అధికారుల సహకారంతో సర్దుమణిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక నాయకుల అండదండతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక పంపిణీ పథకాన్ని చూపిస్తూ ఈ ఇసుక అక్రమ దందా ఒడి కడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు అధికార పార్టీ నాయకుల ప్రలోభంతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కొలచన కోట గ్రామస్తులు ఆరోపణ. గతంలో కొలచనకోట గ్రామంలో జరిగిన అక్రమ తవ్వకాల కన్నా కూడా ప్రస్తుతం రాత్రికి రాత్రి రోడ్లు ఏర్పాటు చేసి గిరిజనుల భూములలో ఇసుకను తరలిస్తున్నారు. అంటే ఎంత దారుణంగా పరిస్థితి ఉందో అర్థమవుతుంది. ఆ గ్రామస్తులు గతంలో తహాశీల్దార్ జి.రజిని కుమారి, ఈ భూములు ప్రభుత్వ భూములని ఇక్కడ ఎవరు పొలాలు అమ్మడం గాని కొనడం గాని జరగకూడదంటూ ఈ భూములలో ఇసుకను తవ్వినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజానీకానికి తెలిసేటట్లుగా బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. ఆ బోర్డులో ఈనాటి కూడా కనిపించిన పరిస్థితి. ఆరోజున తహాశీల్దార్ రజనీకుమారి మైనింగ్, రెవెన్యూ పోలీసు శాఖతో కూడిన టీమ్‌ని ఏర్పాటు చేస్తామని ఆ భూములకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి కూడా ఆ విధమైనటువంటి చర్యలు కనపడినటువంటి పరిస్థితి. ఇప్పుడు ఉన్నటువంటి రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు చేస్తుందని, గ్రామస్తులకు తెలియపరిచి చేతులు దులుపుకుంటున్నారే గాని ఆ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టగలిగితే గిరిజనుల భూములను, స్మశాన వాటికలను, ఇతర రైతుల భూములను కాపాడిన వారు అవుతారని మండల ప్రజలు అంటున్నారు.

# బాలికల గురుకులంలో దరఖాస్తులు ఆహ్వానం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**

స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి (ఇంగ్లీష్ మాధ్యమం),ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ (మాధ్యమం) జూనియర్ ఎంపీసీ, బైపిసి సిఇసి గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ కె.రమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి ఐదో తరగతికి 80 సీట్లు,ఇంటర్మీడియట్ ఎంపీసీ (40),బైపీసీ (40),సి.ఈ.సి(80)సీట్లు గ్రూపులలో ప్రవేశమునకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను ఫిబ్రవరి 07 నుండి మార్చి 06 వ తేది లోపు ఆన్లైన్ విధానంలో సమర్పించాలని అన్నారు.5వ తరగతి ప్రవేశ పరీక్షలకు ఏప్రిల్ 6 వ తేదీ ఉదయం 10 గంటలు నుండి 12 గంటలు వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటలు నుండి సాయంత్రం 4:30 వరకు నిర్వహిస్తారని తెలిపారు.

## జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుపై న్యాయవాదులు హర్షం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**

మండల కేంద్రంలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేసినందుకు మండల ప్రజలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేసినట్లు న్యాయవాది సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. సింగరాయకొండ రెవెన్యూ గ్రామంలో ఏర్పాటు కాబోతున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి సింగరాయకొండ, జరుగు మల్లీ,టంగుటూరు,కొండేపి, పొన్నలూరు రెవెన్యూ మండలాలను కలుపుతూ ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంపై స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. సింగరాయకొండ, కొండేపి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఐదు మండలాలు చేర్చడం జరిగిందని, ఆయా మండలాల కక్ష దారులు, క్లయింట్స్ న్యాయవాదులు నూతన కోర్టు ఏర్పాటుకు సహకరించిన ప్రకాశం జిల్లా జడ్జి, హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కే మన్మథరావు, స్థానిక న్యాయవాదులు సన్నుబోయిన శ్రీనివాసులు నాయుడు కే మల్లికార్జున, బక్కమంతుల వెంకటేశ్వర్లు, కొల్లూరు నరసింహారావు, టంగుటూరు మండల న్యాయవాదులు పి. సంజీవరెడ్డి,ఉన్నం మారుతి ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిరుద్యోగ రహితంగా మార్చే లక్ష్యంతో ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు

### - ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను అమరావతి గ్రౌండ్స్ వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కెట్ యార్డు నాయకులు యారవ శ్రీనివాసులు, కనిగిరి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, రిజ్వాన్, ఆంజనాయుడు, సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

**ఉద్యోగ అవకాశాలు కల్పన :**

ఈ సెల్ ద్వారా 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యనభ్యసించిన నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అర్హులైన అభ్యర్థులను గుర్తించి జాబ్ మేళా నిర్వహించి, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కార్యచరణ సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే ఉగ్ర వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు.

## మిరియం వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని



**కనిగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామ వాస్తవ్యులు మిరియం సుబ్బరాయుడు వైదేహి దంపతుల కుమారుడు చిరంజీవి వెంకటేష్, కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లి గ్రామ వాస్తవ్యులు చెరుకూరి చెన్నకేశవులు, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె చరితల వివాహ వేడుకలు శనివారం రాత్రి గుంటూరు పట్టణంలోని కొమ్మినేని గార్డెన్స్ నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో తూర్పుకోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్ధన్‌రావు అండ్ బ్రదర్స్, మిరియం గురవయ్య, నాగినేని రమేష్‌బాబు, మోపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, మిరియం వారి కుటుంబ సభ్యులు, చావ వారి కుటుంబ సభ్యులు, చెరుకూరి వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

# చక్కా చెన్నకేశవులకు ఘన సన్మానం



**కనిగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

33 ఏళ్ళ పాటు సివిక్స్ అధ్యాపకునిగా సేవలందించి తన మంచితనంతో అందరిని మెప్పించిన కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకులు చక్కా చెన్నకేశవులను పలువురు కొనియాడారు . ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో శనివారం కళాశాలలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కనిగిరి పొన్నలూరు జీజేసీల్లో విశిష్ట సేవలు అందించి విద్యార్థుల శ్రేయస్సుకు పాటుపడ్డారని అభినందించారు. ఆయనను బంధుమిత్రులు, వివిధ కళాశాలల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు ప్రిన్సిపాల్ జి.రాజేంద్ర బాబు, పీసీపల్లి ప్రిన్సిపాల్ విజయ శంకర్, కదిరి నాగేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డిగ్రీ కళాశాల దాత తంగుటూరి గోవిందరావు, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు కాశీం పీరా, బి.రవీంద్ర, పి.వెంకటరమణ, వి.రామరాజు, ఎస్‌కే కోటి సాహెబ్, వై.నాగమణి, ఏ.హనుమంతరావు, ఏ.వెంకట రాజు, కోటేశ్వరరావు, నాగ శిరీష, మమత, విద్యార్థులు, బంధుమిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీ చేసిన విద్యాశాఖ అధికారులు



**రాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మండలంలోని ఒద్దులవాగుపల్లి ఎయిడెడ్ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్ శర్మ, ఏ శివకోటేశ్వరరావులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులు వారి వివరాలు, రికార్డులు వాటి నిర్వహణ పరిశీలించి పూర్తి సమచారాన్ని సేకరించారు. పాఠశాలలో విద్యార్థుల వాస్తవ సంఖ్య ఎంత, ఆన్‌లైన్ నమోదు ఎంత, ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు, యుడైస్‌లో విద్యార్థుల వివరాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల తనికీకి ఉన్నతాధికారులు త్రీమెన్ కమిటీ నియమించిందని వారి ఆదేశాల మేరకు ఈ కమిటీ పాఠశాలలను తనిఖీ చేయడం జరిగిందని తమ తనిఖీల్లో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని వాటన్నింటినీ నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులు బిఎల్ రామానాయక్, ఎం బాలరాజు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డీప్యూటీ సీఎంపై అవాంచిత పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి




**చీరాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అవాంచిత పోస్టులను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు. శనివారం చీరాల ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ట్విట్టర్లో అసభ్యంగా పోస్టు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉన్న పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం హనానమయ్యేలా బాడి షేమింగ్‌కు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాలవలస శ్రీనివాస్(ఫోగ్రాం కమిటీ జిల్లా కార్యదర్శి), మామిడాల శ్రీనివారావు, హనుమకొండ కిషోర్, గోకుల్ కిరణ్, కనపర్తి రామారావు, లక్కాకుల లక్ష్మి, టి.కోటేశ్వరి, ఎం.వీరమ్మ, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



**కొండపి, ఫిబ్రవరి 22 ,ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కె.ఉప్పలపాడు జెడ్‌పిహెచ్ ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సునన్న కుమార్ విద్యార్థులకు సూచించారు. శనివారం జెడ్‌పిహెచ్‌ఎస్ నందు ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దశలోనే తన లక్ష్యాన్ని ఎంచుకొని వారి లక్ష్యం వైపు విద్యను కొనసాగించాలని ఆయన సూచించారు. దేశంలో మేధావులు అంతా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవీ విగ్రహానికి విద్యార్థులచే పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థుల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ విద్యాకమిటీ ఛైర్మన్ రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన గుడ్లను పాఠశాలలకు సరఫరా చేయొద్దు

### - ఎంఈఓ గిరిధర్ శర్మ



**రాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

కాలం చెల్లిన గుడ్లను పాఠశాలలకు సరఫరా చేయొద్దని రాచర్ల మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా గుడ్లు, చిక్కి తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేస్తుందని అవి గోడౌన్‌కు చేరిన తర్వాత నిర్ణీత సమయాలలో పాఠశాలలకు వెళుతున్నాయా లేదా వాటికి టైం అయిపోయిందా అనే విషయాలను తనికీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఏవిధంగా సరఫరా చేస్తుందో అదేవిధంగా పాఠశాలలకు పంపిణీ జరగాలని ఏవైనా లోటుపాట్లు, తేడాలు ఉంటే ఉపేక్షించమని అన్నారు. నిర్ణీత సమయంలోనే ఆ వస్తువులు పాఠశాలలకు చేరాలని సమయం అయిపోయిన తరువాత వాటిని పాఠశాలలకు పంపవద్దన్నారు. గోడౌన్ రికార్డులు కచ్చితంగా అమలు చేయాలని వచ్చిన స్టాక్ వివరాలు, పాఠశాలలకు పంపిన స్టాక్ వివరాలు రికార్డుల్లో పక్కాగా నమోదయి ఉండాలని ఏదైనా నష్టం జరిగితే అందుకు సంబంధించిన వివరాలు కూడా రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు నష్టం జరిగిన పదార్థాల వివరాలు, ఫోటోలతో సహా తీసి ఉంచాలన్నారు. తమ పాఠశాలకు వచ్చే పదార్థాలు కాలం చెల్లినవి అని తమకు ఫిర్యాదులు అందితే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



**బేస్తవారిపేట, ఫిబ్రవరి 22 ,ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలం కలగొట్లలో శుక్రవారం చోటుచేసుకుంది. కర్నూలు - ఒంగోలు హైవేపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను బేస్తవారిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో బెలూన్‌లు తెరచుకోవడంతో క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పింది. వీరందరూ కడప జిల్లా పోరుమామిళ్ళకు చెందిన వారుగా పోలీసులు తెలిపారు.

## వైసీపీ పార్టీకి పామూరు మండలంలో పూర్వ వైభవం తీసుకువస్తా

### - గంగసాని హుస్సేన్‌రెడ్డి



**పామూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

పామూరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక శాతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కైవసం చేసుకునేలా కృషి చేస్తానని మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి అన్నారు. నూతన మండల పార్టీ అధ్యక్షుని నియామకంలో తిరిగి తనపై నమ్మకంతో తనను ఎన్నుకున్నందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుండి నేటి వరకు అధ్యక్షునిగా క్లిష్టసమయంలో సైతం పార్టీని అంటిపెట్టుకుని ఉండి ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏర్పడి తొమ్మిది నెలలకే ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను నట్టేటా ముంచిన ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. ప్రజా వ్యతిరేకతను క్యాస్ చేసుకుని మండలంలోని ప్రతి గ్రామంలో నూతన కమిటీల ద్వారా వైసీపీ ప్రభంజనాన్ని సృష్టించేందుకు పావులు కదుపుతామన్నారు. అమ్మఒడి, రైతు సాయం, సూపర్ సిక్స్ పథకాలు ఇలా ఎన్నో ఎన్నికల హామీలు నెరవేర్చకపోగా ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. నూతన మద్యం పాలసీతో ఇబ్బడిముబ్బడిగా రేట్లు పెంచి అవినీతి దార్లు చంద్రబాబునాయుడు వేస్తున్నారన్నారు. ఇసుక మాఫియా రెచ్చిపోతుందని, రాష్ట్రంలో అశాంతి హెచ్చుమీరిపోతుందన్నారు.రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగిఎంపిక చేసేందుకు కృషి చేయాలన్నారు.

## రాష్ట్రాభివృద్ధి కోరుకునే వారు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



**పామూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

రాష్ట్రాభివృద్ధిని కోరుకునే యువత కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించి అభివృద్ధిలో తమ వంతు భాగస్వాములు కావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పారిశ్రామికవేత్త కోటపాటి జనార్ధన్‌రావు కోరారు. శనివారం నాడు కృష్ణ, గుంటూరు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆళ్ళపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే ధ్యేయంగా వినుకొండ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో ఎమ్మెల్సీ ఎన్నికల వినుకొండ నియోజకవర్గ పరిశీలకులుగా ఎంపిక చేయడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ముఖ్యంగా యువత గత ఐదేళ్ల పాలనలో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారని అన్నారు. జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను జగన్ ముంచారని అన్నారు. గ్రామ సీమలు నేడు అభివృద్ధిలో కళకళలాడుతున్నాయంటే చంద్రబాబునాయుడు చేపడుతున్న సంస్కరణలే కారణం అన్నారు. పంచాయతీలకు కోట్లాది రూపాయల నిధులను జమ చేస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తపనపడుతున్నారని జనార్ధన్‌రావు తెలిపారు. శనివారం నాడు వివేకానంద విద్యాసంస్థల అధిపతి షేక్ రఫీ అహ్మద్‌తో సమావేశమై యువతతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఈనెల 27న జరగనున్న ఎన్నికల్లో పాల్గొని కూటమి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోటపాటి కోరారు.

# జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా నైపుణ్యాల అభ్యసనం



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి22,ప్రభాతవార్త**

సమగ్ర శిక్ష ఐసిడిఎస్ ఆధ్వర్యంలో య ర్రగొండపాలెం మండలంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.జాతీయ విద్యా విధానం 20-20ద్వారా పిల్లలకు నైపుణ్యాల అభ్యసన కోసం ఈ కార్యక్రమం నిర్వహిచడం జరుగుతుంది.మూడరోజు జ్ఞాన జ్యోతి శారీరక అభివృద్ధి,భాషా అభివృద్ధి మరియు మేధాభివృద్ధి సంభంధించి పరిచయం,కృత్యములు ప్రదర్శనలు నిర్వహించారు.ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా య ర్రగొండపాలెం మండల విద్యాశాఖదికారి పి.ఆంజనేయుల మల్లానాయక్ హజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్ అందరకి కూడా 129రోజుల సర్టిఫికెట్ కోర్సుకు ట్రెనింగ్ ఇస్తున్నామని,అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడి సెంటర్లో ఎన్రోల్మెంట్ పెంచడానికి,విద్యాభ్యాసం మెరుగుపరచడానికి కృషి చేయాలని సూచించారు.పిల్లలకు ఆటల పాటల ద్వారా అభ్యసన చేయుట తల్లిదండ్రుడలకు సహజ భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.పద్మజ,కె.వి.సుజాత,కోర్సు డైరెక్టర్ రమాదేవి,ఉపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి,వినయ్,తదితరులు పాల్గొన్నారు.ఉత్తమ టియల్ యమ్‌లకు బహుమతులు అందజేశారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పించిన బిజేపి నాయకులు



**గిద్దలూరు, ఫిబ్రవరి 22 ,ప్రభాతవార్త**

ఆనవాళ్ళు దేశ చరిత్రకు ముద్రింపు రాళ్ళు వాటిని పరిరక్షించుకోకపోతే చరిత్ర కాల గర్భంలో కలిసిపోతుందని అప్పిశెట్టి ఉదయశంకర్ తెలియజేశారు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం కెఎస్ పల్లె హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. నరసింహారెడ్డికి నివాళులర్పించిన ఉదయ్ శంకర్ నరసింహారెడ్డి ఆంగ్లేయులపై కత్తి తీసి వారి చేతిలో హతుడైన చరిత్రలో దక్కవలసిన స్థానం ఆయనకు దక్కలేదని అభిప్రాయపడ్డాడు. ఈ కార్యక్రమంలో సంఘ సేవలకు, ఆర్ట్ఆఫ్ లివింగ్ యోగా శిక్షకులు బిఎస్ నారాయణ రెడ్డి, బిజేపి పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, భవనాసి రామాంజనేయులు, ఖాదర్ వలి, ప్రధానోపాధ్యాయుల మంజురేఖ, జనార్ధన్ రెడ్డి, మహమ్మద్ రఫి, శివమల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



**ముండ్లమూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మండలంలోని లక్ష్మీ నగర్ గ్రామంలో శనివారం జక్కం నారాయణరెడ్డి కుమారుని వివాహానికి హాజరై నూతన వరుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. అనంతరం మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో ముదుర్ల వెంకట రమణారెడ్డి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధువును ఆశీర్వదించడం జరిగింది. అనంతరం కొమ్మవరం గ్రామంలో వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

**కార్యకర్తలని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన బూచేపల్లి :**

మండలంలోని వేములబండ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయిన కంచుమాటు ఏడుకొండలు గృహాన్ని పరిశీలించి ఆర్థిక సాయం అందజేసిన ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. అనంతరం మండలంలోని ఎం.పాడు గ్రామంలో ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ పార్టీ కార్యకర్తలు గండి మహేష్, గండి వీరయ్య, గండి అనిల్‌ను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసీపీ మండల కన్వీనర్ జిల్లా నాయకుడు సూదిదేవర అంజయ్య, మాజీ ఎంపీపీ పోసం మధుసూదన్‌రెడ్డి, రైతువిభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బంకనాగిరెడ్డి, మాజీమండల కన్వీనర్ సుంకర బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చింత శ్రీనివాసులురెడ్డి, గొంది అప్పిరెడ్డి,రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరెడ్డి,వైసీపీ నాయకులు మొదుల్లా సుబ్బారెడ్డి,అన్నపురెడ్డి బిక్షాలరెడ్డి,అంబటి వెంకటేశ్వరరెడ్డి, దుగ్గినేని వెంకట్, కంచుమాటి సుబ్బయ్య, బిజ్జం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి జూనియర్ కాలేజీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ 13వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరక్టర్ రాయల శ్రీనివాసరావు, రాయల కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**మలబార్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ :**

నరసరావుపేటలోని మలబార్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటిలక్ష్మీ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు పాల్గొన్నారు.

# రైతులను ముంచిన కూటమి ప్రభుత్వం

### - దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జికృష్ణారెడ్డి



**దర్శి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ, రాష్ట్ర అసంఘటిత, ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కైపు వెంకట కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడాఉ. ఆంధ్రప్రదేశ్ రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఉందన్నారు. లక్షల్లో అప్పులు, రోజుకో బలవన్మరణం జరుగుతున్నా కూటమి ప్రభుత్వం మరణాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారినా, రైతుల తలరాతలు మారడం లేదన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. దర్శి నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో మార్చి రైతు విలవిల్లాడుతుంటే కంది రైతు కంట కన్నీరు పెడుతున్నారన్నారు.

## విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మండలంలోని దూపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ భారత ప్రభుత్వం సమన్వయంతో చేపడుతున్న బహత్తర కార్యక్రమం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనూష మాట్లాడుతూ భూమిగల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె నీరజ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నుంచి అందుతున్న పిఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంటల భీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ, తదితర పథాలు పొందాలంటే 11అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. ఇందుకుగాను పొలం ఉన్న ప్రతిరైతు ఆధార్ కార్డుకులింక్ అయిన ఫోన్ నంబర్, పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వేలంపాటల ద్వారా రంగస్వామి ఆదాయం రూ.10.23 లక్షలు : ఈఓ రమేష్



**రాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

రంగస్వామి దేవస్థానంలో వ్యాపార విక్రయాలు నిర్వహించుకునేందుకు శనివారం నిర్వహించిన వేలంపాటల్లో రూ.10.23లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి బద్దెపురి రమేష్ తెలిపారు. మండలంలోని జేపిచెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యాపార విక్రయాలు నిర్వహించుకునేందుకు స్థానిక ఆలయంలో శనివారం బహిరంగ వేలంపాటలు జరిగాయి. కాఫీ, టీ, టిఫిన్ అమ్ముకునేందుకు శివాపురం కృష్ణమూర్తి అనే వ్యక్తి 3లక్ష 50వేలకు, క్యాసెట్లు, ఫోటోలు అమ్ముకునేందుకు బొందిలి బాలాజీ సింగ్ అనే వ్యక్తి రూ.2లక్షల 95వేలకు, బొమ్మలు, గాజులు అమ్ముకునేందుకు బొందిలి హనుమాన్ సింగ్ అనే వ్యక్తి రూ.1లక్ష 28వేలకు, కూల్ డ్రింక్స్ అమ్ముకునేందుకు బుర్రి తులసయ్య అనే వ్యక్తి రూ.2లక్షల 50వేలకు, వేలంపాటలో హెచ్చు పాఠశాలలుగా నిలిచారని ఆయన తెలిపారు. ఇకపోతే తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు, టెంకాయలు అమ్ముకునేందుకు, కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకునేందుకు, ఐస్‌క్రీమ్ అమ్ముకునేందుకు, గుండం వద్ద ఫోటోలు తీసుకునేందుకు వేలంపాటలు జరుగలేదని వీటికి మార్చి 8వ తేదీ శనివారం వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ సిబ్బంది ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. వేలంపాటల కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జి నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది సంద్ర రాజేశ్వరరావు, దండు రాంబాబు, సంకుల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు. శ్రీ కృష్ణదేవరాయ కాపు బలిజ సత్రంలో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు సత్ర నిర్వాహకులు కన్నసాని గోపాల్ రావు, తోట చంద్రయ్యలు తెలిపారు.

## పెద్దారవీడు మండలంలో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

**పెద్దారవీడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మండలంలోని పుచ్చకాయలపల్లి, ఎస్ కొత్తపల్లి, గొబ్బూరు గ్రామాలలో పంచాయితీ రాజ్ కమీషనర్ ఆదేశాల మేరకు శనివారం చెత్త ఏరివేతపై ప్రత్యేక కార్యక్రమం ఈఓపిఆర్‌డి కెజి ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ డ్రైవ్ ప్రతి శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. గ్రామాల ప్రజలందరూ కూడా చెత్తను రోడ్ల ప్రక్కన కాలువలో వేయకుండా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తగా వేరు చేసుకొని పంచాయితీ నుండి వచ్చే క్లాప్ మిత్రులకు ఇవ్వాలని తెలిపడం జరిగింది. తద్వారా మన వీధి శుభ్రంగా ఉంటుందని మన గ్రామాలు కూడా శుభ్రంగా ఉంటాయని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర మండలంలోని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చుకోవాలని మండలంలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, కాపుమిత్రులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలి

**- జనసేన పార్టీ మండల అధ్యక్షులు నున్నా బాలసుబ్రహ్మణ్యం**



**మద్దిపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మండల పరిధిలోని గుండ్లకమ్మ పరివాహక ప్రాంత గ్రామమైన కొలచన కోట రెవెన్యూ పరిధిలో గత కొన్ని రోజుల నుంచి ఇసుక అక్రమ దారులు అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని కొలచనకోట గ్రామస్తులు జనసేన పార్టీ మండల అధ్యక్షులు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు కొలచనకోట రెవెన్యూ పరిధిలోని ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంతంలో తవ్వకాలు వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ స్థానిక ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, తహశీల్దార్ ఎం.సుజన్ కుమార్, స్థానిక ఎస్సై బి.శివరామయ్య, విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డి తదితరులు కలిసి సమస్యలను వివరించి అర్జీ రూపంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు ఆరేం వెంకటేశ్వర్లు, వీర మహిళ విభాగం అధ్యక్షురాలు కాకర్లపూడి హరిత, జనసేన పార్టీ నాయకులు నూనె శ్రీనివాసరావు, గుండాబత్తుల సోమశేఖర్, గడియపూడి సత్యం, కనపర్తి శేషయ్య చౌదరి, దండే రామారావు, ఆర్.విజయ్ కుమార్, పొన్నం అయ్యప్ప, కలవ ఏడుకొండలు, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి



**వెలిగండ్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

శనివారం మండలంలోని హుస్సేన్ పురం, మరపగుంట్ల, కొటాలపల్లె గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు(ఫార్మర్ రిజిస్ట్రేషన్) చేపించుకోవాలని తెలియజేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ చేపించుకొనుటకు ప్రతి రైతు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో తమ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఆధార్ కార్డు వలె ప్రతి రైతుకు కూడా రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ పంటల భీమా, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు ఫార్మర్ రిజిస్ట్రీ నందు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తింపచేస్తారని తెలిపారు. పంట నష్టం, ఇన్సూరెన్స్ పథకాలను పొందడానికి ఖచ్చితంగా రైతు నమోదు సంఖ్య చేపించుకొని ఉండాలని తెలిపారు. రైతులందరూ ఈనెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు, పాస్ బుక్ జిరాక్స్ కాపీలను తీసుకొని రైతు సేవా కేంద్రం నందు సంప్రదించాలని తెలిపారు. రైతులు రబీ సీజన్లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తి ఈ నెల 25 లోపు చేసుకోవాలని కోరారు.

## శ్రీశైలానికి మార్కాపురం డిపో నుంచి 80 బస్సు సర్వీసుల ఏర్పాటు

**మార్కాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మార్కాపురం డిపో నుండి ప్రత్యేకంగా 80 అర్జీలు బస్సులను ఏర్పాటు చేసినట్లు మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులు తెలిపారు. సౌకర్యవంతమైన ప్రయాణం సురక్షితమైన ప్రయాణాన్ని భక్తులు ఆర్టీసీ బస్సు సర్వీసుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీశైలం అటవీ ప్రాంతంలో ఆర్టీసీ ప్రయాణం ఎంత సురక్షితమని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమయానుకూలంగా మార్కాపురం డిపో నుండి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి - డీఎస్పీ నాగరాజు





**మార్కాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ కే.రంగయ్య ఏవో రంజిత్ కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్ సివి రామన్ సైన్స్ ఎక్స్‌కో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల లో దాగిఉన్న మేధాశక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. తగినంత ప్రోత్సాహం లేక ఎందరో మేధాశక్తి గల విద్యార్థులు మరుగున పడిపోతున్నారని అలాంటి వారిని వెన్ను తట్టేందుకు వాసవి విద్యానికేతన్ యాజమాన్యంతీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. సుమారు 200 ప్రాజెక్టులను విద్యార్థులు ఈ ఎక్స్పో ద్వారా ప్రదర్శించడం హర్షణీయమని అన్నారు. డిప్యూటీ ఈవో సామేల్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. నాటి రోజులకు నేటి రోజులకు చాలా వ్యత్యాసం ఉందని ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు గాలికంటే వేగంగా ఆలోచనలు చేస్తున్నారని ఆ ఆలోచనల రూపకల్పనకు ఇలాంటి ఎక్స్‌పోలు వేదికగా నిలుస్తాయని అన్నారు. ప్రిన్సిపాల్ రంగయ్య మాట్లాడుతూ ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయని అన్నారు. 200 ప్రాజెక్టులను తిలకించేందుకు తల్లిదండ్రులు ఇతర పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావడం ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.రాందాస్ నాయక్ , శార్వాణి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ లీడర్ గొల్ల వరలక్ష్మీ, అప్పుస్మ, అధ్యక్షులు జి.మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి



**మార్కాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రథమ స్వాతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సేవా సంఘం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో తెల్లజాతీయులపై యుద్ధం చేసి మట్టి కరిపించిన నరసింహారెడ్డి కీర్తి అజరామరమైనదని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ నెంబర్ కందుల రామిరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, మారంరెడ్డి కృష్ణారెడ్డి, దారిమడుగు సర్పంచ్ బట్టగిరి గౌతం గోపాల్‌రెడ్డి, జవాజి రామానుజలరెడ్డి, కొల్లూరు రమణారెడ్డి, టి.రామిరెడ్డి, రెడ్డి మహిళా సంఘం గుంటక వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యంగ్ ఇండియా కేబోల్ ఢిల్లీ పోటీలకు ఎంపిక అయిన పాలపర్తి విజేష్ రాజ్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్నభవన్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న యంగ్ ఇండియా కేబోల్ సీజన్-5 రాష్ట్ర స్థాయి డిబేట్ కాంపిటేషన్‌లో రన్నర్‌గా గెలుపొందిన సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్‌కు ఈ సందర్భంగా రూ.7500 నగదు బహుమతి, ప్రశంసా సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాలపర్తి విజేష్ రాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలించాలని యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వాడకం తగ్గించాలని భారత రాజ్యాంగం సక్రమంగా అమలు చేయాలని పేర్కొన్నారు. మార్చి నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాలపర్తి విజేష్ రాజ్ పాల్గొననున్నారు. ఈ బహుమతిని పానెల్ సభ్యులుగా రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి పీవీ బాల కోటేశ్వరరావు, ఏపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మస్తాన్ వలీ, సీనియర్ జర్నలిస్టు షేక్ బాబు, యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రటరీ మమత నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, యంగ్ ఇండియా కే బోల్ ఐవైసీ అబ్జర్వర్ నికితారావు, యంగ్ ఇండియా కే బోలో రాష్ట్ర ఇన్‌ఛార్జి రాజ్ కుమార్ చేతుల మీదుగా విజేష్ రాజ్ దీనిని అందుకున్నారు.

# నేడు మర్రిపూడిలో ఉచిత కంటి వైద్యశిబిరం

**మర్రిపూడి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మర్రిపూడి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో అమృత కంటి హాస్పిటల్ పొదిలి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని అమృత కంటి హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ వరికూటి భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి శుక్లములు కలవారికి అతి తక్కువ ఖర్చుతో నిపుణులైన వైద్య బృందంచే కంటిలో అద్దమును అమర్చు ఆపరేషన్ 50 శాతం రాయితీతో చేయబడునని తెలిపారు. పేద ప్రజలు ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్ చేయబడుతుందన్నారు. చత్వారము, మసకలు ఉన్న వారికి పరీక్షించి వివిధ రకాల బ్రాండెడ్ కళ్ళ జోడును 50 శాతం రాయితీతో ఇవ్వబడుతుందన్నారు. గ్రామ ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రత్యేక శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతానికి నడుంబిగించండి

**- ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్**



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేక శిక్షణ ద్వారా వారి వారి అంగన్‌వాడీ కేంద్రాలు అభ్యున్నతకు పాటుపడాలని ఒంగోలు డిప్యూటీ డీఈఓ, ఏ.చంద్రమౌళేశ్వర్ కోరారు. సంతనూతలపాడు హైస్కూల్లో మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా నాల్గో రోజున శనివారం నాడు జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడ ఎంఈఓ డి.వెంకారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ శిక్షణకు కోర్సు డైరక్టర్‌గా సంతనూతలపాడు హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద వ్యవహారించారు. అంగన్‌వాడీ టీచర్లకు భౌతికంగా, ఆన్‌లైన్ ద్వారా ఇచ్చే శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని చంద్రమౌళేశ్వర్ వెల్లడించారు. ఈ శిక్షణలో నైపుణ్యత ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన బోధన చేయవచ్చునన్నారు. పిల్లలకు బడి పట్ల భయాన్ని పోగొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మీ, పార్వతి భాయ్, రిసోర్స్ పర్సన్స్, మౌలా ఖాన్, శేషు కుమారి, విజయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# టీడీపి నేత వెంకటేశ్వర్లుకు పలువురు ఘన నివాళులు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని వడ్డెరపాలెం ట్యాంక్ బజార్ నందు మృతి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లెపు వెంకటేశ్వర్లుకు మాజీ జడ్పీటీసీ, టీడీపీ నేత తన్నీరు శ్రీనివాసరావు తదితరులు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.ఇంద్రబాబు, కే.ఆంజనేయులు, మద్దిరాలసుబ్బారావు తదితరులు వెంకటేశ్వర్లుకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# గ్రీవెన్స్‌కు 140 అర్జీలు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

ఒంగోలులోని మంగమూరు రహదారిలో శనివారం నాడు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఈ మేరకు ప్రజల నుండి 140 అర్జీలు లభించాయి. అర్జీదారులు సమస్యలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వివరించి తదుపరి వినతిపత్రాలను అందజేశారు. సీఎం రిలీఫ్, సీసీ రోడ్డు, సైడు కాలువలు, రెవెన్యూ, మండల పరిషత్ తదితర శాఖలకు సంబందించి ప్రజలు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు దరఖాస్తులు సమర్పించారు. కొందరు దరఖాస్తుదారుల సమస్యలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అక్కడే పరిష్కరించారు. ఆయా ప్రజల అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి వాటి పరిష్కారానికి రికమండ్ చేస్తూ సంబంధిత అధికారులకు వాటిని పంపించారు.

# దు:ఖసాగరంలో మైనంపాడు గ్రామస్తులు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

ఒంగోలు త్రోవగుంట కిమ్స్ హాస్పిటల్ హైవే జంక్షన్ వద్ద శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన రావులపల్లి అశోక్(34) మృతి చెందారు. దీంతో మైనంపాడు గ్రామస్తులు దు:ఖసాగరంలో మునిగిపోయారు. మృతి చెందిన అశోక్‌కు ఇద్దరు పిల్లలు కలరు. అద్దంకిలో టైల్స్ వర్క్‌లో భాగంగా పని కుదుర్చుకొని తన వాహనంపై అశోక్ ఒంగోలు వస్తుండగా త్రోవగుంట సమీపంకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ కంటైనర్ ఢీకొని మృతి చెందాడు. ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు అశోక్ మృతదేహాన్ని ఒంగోలు తాలూకా పోలీసులు తరలించారు. మైనంపాడు గ్రామానికి చెందిన పలువురు రిమ్స్ హాస్పిటల్‌కు తరలి వెళ్లారు. టైల్స్ వర్క్ చేపట్టే గ్రామానికి చెందిన అశోక్ ఈ ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు దు:ఖ సాగరంలో మునిగిపోయారు.

# క్రమశిక్షణతో చదివి ప్రయోజకులు కావాలి

**- బీఎం డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ ఫేర్వెల్ డే సభలో ఎస్సై మహేష్**



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు సమాజానికి పేరు తెచ్చే వ్యక్తులుగా ప్రయోజకులు కావాలని పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ కోరారు. పెద్దదోర్నాల వసంత జూనియర్ కళాశాల, బీఎం డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ప్రెషర్స్ అండ్ ఫేర్వెల్ ఫంక్షన్ సభకు ఎస్సై వి.మహేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు .ఈ కార్యక్రమానికి బట్టు విద్యా సంస్థల అధినేత బట్టు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై వి.మహేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఏ ఆశయంతో టైం టు టైం అన్ని సౌకర్యాలు మీకు కల్పించి కళాశాలకు పంపిస్తున్నారో దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా క్రమశిక్షణతో చదివి ఎదగాలని కోరారు. తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకునే కళాశాలలో సత్ప్రవర్తనతో చదువుకొని సైబర్ నేరాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మోటారు సైకిళ్లపై తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుండి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యాకలాపాలకు అలవాటు పడితే ఉజ్వల భవిష్యత్తు నాశనం అవుతుందని గుర్తెరిగి భాగా చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి పేరు తెచ్చే ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖాధికారి మస్తాన్ నాయక్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పెద్దదోర్నాలలో బట్టు విద్యాసంస్థలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చదువుకుంటేనే చైతన్యం కలుగుతుందని, తమ చదువుల ద్వారా తమ కుటుంబాలకు మేలు జరిగి అభివృద్ధి బాటలో ముందుకు సాగుతామన్నారు. ఈ సభలో టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళీకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాలయ్య నాయక్, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య చౌదరి, ఇరిగల దేవయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ఎస్వీ నారాయణరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకర్షించాయి. గతంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బట్టువిద్యాసంస్థల అధినేతలు బట్టు రమణారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డిల చేతుల మీదుగా ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు.

## కడపరాజుపల్లిలో రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలంలోని కడపరాజుపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు రావాలంటే తప్పనిసరిగా రైతు గుర్తింపు కార్డులు ఉండాలని, కాబట్టి రైతులందరూ రైతు సేవా కేంద్రం నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చైతన్య కుమారి, వీహెచ్ఏ సుస్మిత పాల్గొన్నారు.

# చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం



**పొన్నలూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మండలంలోని భోగినంపాడు సచివాలయం పరిధిలో శనివారం నాడు చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఈవోఆర్డీ కే.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా నిరోధించవచ్చన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ఈవోఆర్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్బయ్య హైస్కూల్లో క్రీడా దినోత్సవ వేడుకలు





**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట లోని బీవీ సుబ్బయ్య హై స్కూల్లో శనివారం రాత్రి ఘనంగా మాస్టర్ సుబ్బయ్య 103వ జయంతిలో భాగంగా క్రీడా దినోత్సవం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విశ్వేశ్వరయ్య, ఎడ్యుకేషన్ సొసైటీ ట్రెజరర్ బొడ్డు రవి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. విద్యార్థులకు తొలిమెట్టు పదో తరగతిని అత్యంత ముఖ్యమైన అంశంగా భావించి కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమానికి సుబ్బయ్య హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వై.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సుబ్బయ్య హైస్కూల్ పూర్వ ఉపాధ్యాయులు, రిటైర్డ్ జూనియర్ కళాశాల అధ్యాపకులు తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి జ్ఞానాన్ని పెంపుదించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. తరగతి గది కర్మాగారం అని, ప్రసూతి గది యని, న్యాయస్థానమని పేర్కొన్నారు. కలలు కని సహకారం చేసుకోవాలన్నారు. సమాజ శ్రేయస్సు వ్యక్తి శ్రేయస్సు అని మాస్టర్ సుబ్బయ్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎంతో ఉన్నతమైన భావాలతో తీర్చిదిద్దబడిన పాఠశాల మాస్టర్ సుబ్బయ్య హైస్కూల్ అని ఆయన వెల్లడించారు. మంచి మిత్రుడు ద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతామన్నారు. పాఠశాల ముఖ్య సలహాదారు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సంధిరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిస కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు విశ్వేశ్వరయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ డాక్టర్ బొడ్డు రవిప్రసాద్,రిటైర్డ్ లెక్చరర్ టి.వెంకటేశ్వరరెడ్డి, పాఠశాల ముఖ్య సలహాదారు సందిరెడ్డి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం వై.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు బహుమతులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు.. పంట దిగుబడి బాగు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

ప్రకృతి సేద్యం చేయటం వల్ల పంట అధిక దిగుబడితో పాటు భూమికి మంరిత పోషకాలు లభిస్తాయని ప్రకృతి వ్యవసాయ అధికారి శేషమ్మ పేర్కొన్నారు. ఈసందర్భంగా మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్(ప్రీ మాన్ డ్రై సోయింగ్) విత్తనాలను తయారు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జ్ శేషమ్మ మాట్లాడుతూ రైతు సోదరులందరూ కూడా వరి, శనగ, మినుము పంటల కోత అనంతరం 30 రకాల విత్తనాలు కనీసం ఐదు జాతులకు అనగా పచ్చి రొట్టె గింజలు, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, ఆకు కూరలు ఇలా అన్ని రకాల జాతులతో కలిపిన ఈఈ కిట్టును భూమిలో చల్లడం ద్వారా 45 రోజుల తర్వాత పశువుల మేతగా వాడుకోవచ్చని, అంతే కాకుండా భూమిలో కలియ దున్నటం వల్ల నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయని, పంట మార్పిడి జరుగుతుందని ఆమె రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడితో పాటు , ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్దదోర్నాలలో భారీ బందోబస్తు

**- మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు**



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. ఈ మేరకు పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ చేసిన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. శ్రీశైలానికి దిగువన ఉన్న పెద్దదోర్నాల శ్రీశైలం వెళ్లే భక్తులతో శివరాత్రి సందర్భంగా రద్దీగా ఉంటుంది. భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని దోర్నాల నుండి శ్రీశైలమునకు, దోర్నాల నుండి ఆత్మకూరు వైపు మార్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించే క్రమంలో డీఎస్పీ తనతో పాటు 4 సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలు కాపాడుతారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలను శ్రీశైలం ఘాట్ రోడ్డుకు అనుమతించేది లేదని తెలిపారు. టూ వీలర్స్ వాహనదారులు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని, వారి కోసం దోర్నాల మల్లిఖార్జుననగర్‌లో మోటారు సైకిల్ పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ మోటారు సైకిల్స్(నిలుపుకొని) పార్కింగ్ చేసుకొని బస్సులలో శ్రీశైలం వెళ్లాలని టూవీలర్స్ వాహనదారులు గమణించాలని కోరారు. శ్రీశైలానికి ఫోర్ వీలర్స్ వాహన రాకపోకలు జరుగుతూనే ఉంటాయని, అయితే శ్రీశైలంలో పార్కింగ్ ప్లేస్లు నిండిపోయాక దోర్నాల నుండి కూడా ఫోర్ వీలర్స్ వాహనాలను శ్రీశైలం వెళ్లేందుకు అనుమతించేది లేదని, దోర్నాలలో నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. దోర్నాల- శ్రీశైలం ఘాట్ రోడ్డు, దోర్నాల- ఆత్మకూరు వైపు పోలీసు సిబ్బంది అప్రమత్తంతో రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయని, దీంతో దోర్నాల నుండి శ్రీశైలం వైపు ఘాట్ రోడ్డు, దోర్నాల- ఆత్మకూరు ఘాట్ రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే క్రమంలో దొంగతనాలు ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘాతో రక్షణ చర్యలు చేపట్టారన్నారు. మొబైల్ వాహనాల ద్వారా నిరంతరం శాంతి భద్రతలు పర్యవేక్షిస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అపసృతి జరగకుండా భక్తులు, ప్రయాణికులు, వాహనదారులు నిబందనలు పాటించి స్వామివార్ల దర్శనం చేసుకుని వెళ్లాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వి.మహేష్ పాల్గొన్నారు.

# కొనకనమిట్లలో పారిశుధ్య పనులు



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మండల కేంద్రం కొనకనమిట్లలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తిరుపతమ్మల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను కూలీలతో ముమ్మరంగా చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు చెత్తను తొలగించి, గురువు మట్టిని, వ్యర్థపదార్థాలను ట్రాక్టర్ల ద్వారా శివారు ప్రాంతానికి తరలించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త ప్రజలకు అవగాహన చేస్తూ వాళ్లకు పాంప్లెంట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఈవోపీఆర్అండ్ ఆర్డీ శ్రీదేవి పాల్గొన్నారు. క్లాప్‌మిత్రాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై అనూక్



**పొన్నలూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జరిగే పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఆలయ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎస్సై అనూక్ శనివారం నాడు సంగమేశ్వర దేవాలయం వద్ద చర్చించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు. వాహనాలకు కేటాయించే పార్కింగ్ స్థలాన్ని కూడా అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కారం

**కనిగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

వేసవి కాలం దృష్ట్యా విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. సాయి నగర్ ప్రాంతంలో విద్యుత్ లోఓల్టేజితో ప్రజలు బాధపడుతున్నారని అందుకు పరిష్కారంగా ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేందుకు చర్యలు చేసుకుంటున్నామని చైర్మన్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలం సేకరణ గురించి శనివారం వార్డులో పర్యటించి స్థలంను గుర్తించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ పవన్ కుమార్, జేఎల్ఎం కరిముల్లా, దూళిపాళ్ల మల్లిఖార్జునరావు, న్యాయవాది విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఫార్మర్ ఐడిలపై క్యాంపుల ఏర్పాటు



**దొనకొండ,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**
నేటి నుండి రెండు మూడు సమీప గ్రామాలని కలిపి ఫార్మర్ ఐడిలపై దొనకొండ మండలంలో 11 క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి యన్. లక్ష్మి నారాయణ తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా నేడు కొచెర్ల కోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో ఏర్పాటు చేసిన క్యాంపు సమావేశంలో మాట్లాడుతూ సాగు పొలం వున్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్టసంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు.ఈ పద్ధతిలో ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్‌కి మూడు సార్లు ఓటీపీలు వస్తాయని వాటిని గ్రామ సిబ్బందికి చెప్పటంలో రైతులు సహకరించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ,రాయితీ విత్తనాలు,సున్నా వడ్డీ పంట రుణాలు మొదలగు వాటికి ఇప్పుడు ఇచ్చే విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు.రైతులు పొలం పాస్ బుక్, ఆధార్‌కార్డు,ఆధార్ సంఖ్యకి లింక్ అయిన ఫోన్ నెంబర్ తీస్కొని మీ గ్రామంలోనే వున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులని సంప్రదించాలని కోరారు. రైతులు రెండు కంటే ఎక్కువ రెవిన్యూ గ్రామాలలో పొలం ఉన్నట్టయితే ఎక్కడో ఒకచోట ఫార్మర్ ఐడి చేయించుకుంటే సరి పోతుందని, రెండుచోట్ల అవసరం లేదని పేర్కొన్నారు .ప్రస్తుతం రైతుల పట్టా సొంత పొలాలకి మాత్రమే సర్వర్ అనుమతిస్తోందని,అసైన్‌మెంట్,ఈనామ్, దేవాదాయపొలాలకి సోమవారం నుండి వస్తదని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు డి.ఈశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది,రెండు గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు.

# కిడ్నీ ప్రాబ్లంతో వ్యక్తి మృతి



**దొనకొండ,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**
దొనకొండ మండలం బాధాపురం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో కిడ్నీ ప్రాబ్లంతో బాధపడుతూ నూనె దేవదాస్ 53yer మృతి చెందారు అతనికి ఒక కుమారుడు ఆ కుటుంబానికి పరామర్శించడానికి వచ్చిన ..మోడీ ఆంజనేయులు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ కుటుంబానికి పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పి కొంత ఆర్థిక సహాయం అందజేశారు.కుటుంబానికి పరామర్శించడానికి తెలుగుదేశం సీనియర్ నాయకులు షేక్ సుభాని షేక్ తోహిద్ సయ్యద్ సద్దాం మున్నా మస్తాన్ బత్తుల బాలరాజు గుడిమెట్ల బాలయ్య మోడీసుబ్బారావు నక్క నారాయణ జాన్ బాబు Badapura సంద్రపాటి ఏసు సంద్రపాటి భాస్కర్ వైదాన దేవదానం నాసరయ్య శేఖర్ తదితరులు పాల్గొన్నారు .

# హెల్మెట్ ధరించాలని కౌన్సిలింగ్



**దొనకొండ,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా ఎస్పీ ఎ. యర్. దామోదర్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు దొనకొండ ఎస్సై టీ.త్యాగరాజు దొనకొండలోని అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద హెల్మెట్ లేకుండా టూ వీలర్ నడుపుతున్న వాహనదారులను ఆపి హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను వారికి తెలియజేసి ప్రతి ఒక్కరూ టూవీలర్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన ఏర్పరచడమైనది.

## జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి

**- ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి**



**కంభం రూరల్, ఫిబ్రవరి 22 ,ప్రభాతవార్త**
కంభం పరిసర ప్రాంతాలలోగల నిరుద్యోగ యువతీయువకులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి అన్నారు. కంభం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో శనివారం యువతీయువకులకు మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో ఉంచుకొని మెగా జాబ్‌మేళాను నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులు వారి అర్హతలు, నైపుణ్యాలను బట్టి జాబ్‌మేళాలలో కంపెనీల ప్రతినిధులు జరిపే ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరచి ఉపాధి పొందాలని సూచించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కేతం శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ గౌస్, చిన్న గౌస్, మాధవ, హర్షత్ అనిష్ మరియు భారతీయ జనతాపార్టీ కంభం మండల అధ్యక్షులు బాదం కిశోర్ మరియు టిడిపి, బిజెపి, జనసేనా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొంగ స్వామీజీలతో జాగ్రత్త

**- పుల్లలచెరువు మండలంలో దొంగ స్వామీజీల కలకలం**

**- దోషాలకు పూజలు చేస్తాం అని మోసం**

**- అనుమానం రావడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు**



**పుల్లలచెరువు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
పుల్లలచెరువు మండలంలో దొంగ స్వామీజీల మోసాలు బయటపడ్డాయి. పుల్లల చెరువు మండలం సిద్దెనపాలెం గ్రామంలో దొంగ స్వామీజీలు పూజలు చేస్తామని స్థానికుల్ని నమ్మించారు. బారీగా డబ్బు వసూలు చేశారు. దైవ శక్తులు ఉన్న దేవుడి ప్రతిమలమంటూ బాగా నమ్మించారు. బారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. కొన్ని ఇళ్ళకు వెళ్ళి గ్రహ శాంతులు చేయాలని దోషాలు ఉన్నాయని భయపెట్టడంతో, సిద్దెనపాలెం గ్రామ ప్రజలు 65వేల వరకు ఈ స్వామీజీలకు ఇచ్చారు. వారి ప్రవర్తనపై అనుమానం రావడంతో మోసపోయామని తెలుసుకుని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సంపత్ కుమార్ దొంగస్వామీజీలను సిసి కెమెరాల సహాయంతో గుంటూరు సమీపంలో దొంగ స్వామీజీలను అదుపులోకి తీసుకొని బాధితులకు వారి నగదు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు నమోదు సి దర్యాప్తు చేస్తున్నామని పుల్లల చెరువు ఎస్సై తెలిపారు. దొంగ స్వామీజీలను పట్టుకుని తమ నగదు అప్పగించినందుకు ఎస్సై సంపత్ కుమార్‌కు వారు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సంపత్ కుమార్ మాట్లాడుతూ పూజల పేరుతో వచ్చే వారిని నమ్మొద్దని, ఇలాంటి గ్యాంగుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పడం, శాంతి పూజల పేరుతో మాయమాటలు చెప్పి గ్రామస్తుల నుంచి డబ్బులు కాజేస్తారని ఆయన అన్నారు. స్వామీజీ వేషదారుల మాయమాటలను నమ్మి మోసపోవద్దని అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

# ప్రభుత్వ సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి



**వెలిగండ్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
ప్రభుత్వం సూచించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్ బాషా కోరారు. శనివారం మండలంలోని రామలింగా పురం, గన్నవరం, ఇమ్మడి చెరువు రాళ్లపల్లి, గుడిపాటిపల్లి సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేలను త్వరితగతిన సచివాలయ సిబ్బంది పూర్తి చేయాలని అన్నారు. ఈ క్రమంలో గుడిపాటిపల్లి సచివాలయం పరిధిలో బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాలకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు పొందిన వారు ఖచ్చితంగా యూనిట్ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఒంగోలు అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



**సంతమాగులూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జ్యోతిర్మయి అన్నారు. శనివారం సంతమాగులూరు మండల పరిషత్ సమావేశం హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ఏ శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శులు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో 443వ రక్తదానం



**అద్దంకి , ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
రక్తహీనత సమస్యతో బాధపడుతున్న అద్దంకి నర్రావారిపాలెం నివాసి పూసపాటి శివపార్వతి (48)కి వైద్యులు అత్యవసరంగా ఒ పాజిటివ్ రక్తం ఎక్కించవలసినది అని చెప్పగా, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావ, బంగ్లారోడ్డులోని ఫోటో స్టూడియో యజమాని పెండ్యాల ఆనందరావు (47)ని ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఇది చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సహించి, రోటరీ ద్వారా చేయించిన 443వ రక్తదానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు,ఎజిపి యర్రమోతు రమేష్‌బాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం చుండూరి మురళీ సుధాకరారావుని రక్తదాత ఆనందరావుని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

## చందలూరి, ఆర్‌విఆర్ కవితలకు అంతర్జాతీయ గుర్తింపు




**అద్దంకి , ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
సాహితీ స్రవంతి అధ్యక్షులు చందలూరి నారాయణరావు, ఆర్‌వి రాఘవరావు లు రచించిన కవితలకు అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సమావేశంలో వీరుఇరువురి కవితా రచనలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. కాలిఫోర్నియా వారు నిర్వహించిన 150వ సాహితీ సమావేశంలో ప్రత్యేక వచన కవిత్వ సంచిక పై దేశ, విదేశాల్లో వున్న 150మంది తెలుగు కవుల, 150 కవిత్వాలను ఈ సమావేశంలో ఎంపిక చేశారు. అందులో భాగంగా అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావు వ్రాసిన చెట్టు కళేబరం, అనే కవిత్వానికి గుర్తింపు లభించింది. అదే విధంగా ఆర్‌వి రాఘవరావు వ్రాసిన ప్రస్థానం కవిత కూడ గుర్తింపు లభించింది. వీరు ఇరువురు వ్రాసిన కవితలు ఈ సమావేశంలో ప్రత్యేకంగా ఎంపిక కాబడ్డాయి. సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె. గీతామాధవి, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్‌లు ప్రకటించారు. వీరు ఇరువురిని ఈ సందర్భంగా అద్దంకికి చెందిన పలువురు కవులు, అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. వీరుఇరువురిని అభినందించిన వారిలో అన్నమనేని వెంకటరావు, డాక్టర్ వలివేటి సుబ్బారావు, డివిఎం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర్ దత్తు, ఇలపావులూరి శేషతల్పసాయి, మిట్టా కామేశ్వరశర్మ, బాలు, లక్కరాజు శ్రీనివాసరావు, తదితరులు వున్నారు.

# వ్యవసాయ రుణాలపై అవగాహన



**బల్లికురవ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
యూనియన్ బ్యాంక్ అంబడిపూడి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు వ్యవసాయ అనుబంధ రుణాలు, కామధేను గోల్డ్ లోన్ పథకం గురించి స్థానిక బ్యాంకు, మేనేజర్ అజిత్ కుమార్‌తో పాటు సిబ్బంది గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఆ రైతులు వ్యాపారులకు బ్యాంకు వినియోగదారులకు అందజేస్తున్న రాయితీ సౌలభ్యాలను వివరించారు. 25 లక్షల వరకు బంగారు ఆభరణాలపై రుణం అందజేయబడుతుందని, ఒక్క గ్రామ బంగారానికి రూ.6వేల నగదు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా రైతన్నలు పంట రుణాలు తీసుకున్న రోజు నుండి 12 నెలలోపు చెల్లిస్తే వడ్డీ 7 శాతం రాయతీ మూడు శాతం పొందవచ్చని, సంవత్సరం తర్వాత చెల్లిస్తే వడ్డీ 10.5శాతం పెనాల్టీ రెండు శాతం, సిబిల్ డిఫాల్టర్ కింద నమోదు అవుతారన్నారు. సకాలంలో రుణాలు చెల్లిస్తూ, ఆర్థిక అభివృద్ధి సాధించడంతో పాటు బ్యాంకు అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు నగదు అధికారి హరీష్, గోల్డ్ అప్రైజర్ శ్రీహరి పాల్గొన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం



**బల్లికురవ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
బల్లికురవ అద్దంకి రహదారిలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ 33వ మైలు వద్ద శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రధాన కాలువలోకి దూసుకెళ్లింది. వాహనంపైన ఉన్న ఇద్దరు యువకులకు ఈత రావడంతో ఈదుకుంటూ బయటపడ్డారు. వ్యవసాయ పనుల్లో ఉన్న స్థానికులు ప్రమాదాన్ని పసిగట్టి ద్విచక్ర వాహనాన్ని తాడులు సహాయంతో బయటకు లాగారు. ఏబీసీలో నీటి ప్రవాహం కూడా తక్కువగా ఉండటంతో వాహనాన్ని త్వరగా బయటకు తీయగలిగారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి సారధ్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ



**మార్టూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంలో శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో వృద్ధులకు ఉచిత కళ్ళజోళ్ళ మందులను పంపిణీ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని నోవా అగ్రి గ్రూప్స్, ఏలూరి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంపులో 150 మంది శస్త్ర చికిత్సలు చేశారు. నెల రోజుల తర్వాత వారికి క్యాంపు కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత కళ్ళజోళ్ళు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతన్ ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిన్నెకల్లు గ్రామంలో ఉపాధి హామీ పనులు తనిఖీ

**- హాజర్ 7 లోపు క్లోజ్ చేయాలి - మెషర్మెంట్ ప్రకారం పని పూర్తి చేయాలి**

**- ఎంపీడీఓ జి.జ్యోతిర్మయి**



**సంతమాగులూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జ్యోతిర్మయి ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు ప్రకారం కూలీ డబ్బులు ఇవ్వడం జరుగుతుందని మెషర్మెంట్ (కొలతలు) ప్రకారం పని పూర్తి చేస్తూ డబ్బులు అనుకున్న విధంగా ఖాతాలో జమ అవుతాయని అన్నారు. ఉదయం 7గంటలలోపు పనికి వచ్చిన వారి వివరాలు పొందుపరచాలని ఫీల్డ్ అసిస్టెంట్ సూచించారు.

## మార్పు, పనితీరు మెరుగుపడేలా శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలి

**- ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ హేనా సుజన్**



**మద్దిపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
స్థానిక మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు జరుగుతున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ హేనా సుజన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వాటిని విద్యార్థులకు అర్థమయ్యే బోధించాలని వారి మానసిక ఎదుగుదలకు దోహదపడే విధంగా అభ్యసనం సాగించాలని తెలిపారు. ట్రైనింగ్‌లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు గ్రూపులుగా మారి పలు రకాల చార్టులు తయారు చేసి వాటిని పీడీ వద్ద ప్రదర్శించారు. ఈ క్రమంలో పీడీ మాట్లాడుతూ ఇదే స్పూర్తితో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చాటుకులు తయారు చేసుకుని ప్రదర్శించాలని తెలుపుతూ అంగన్‌వాడీ వర్కర్లను అభినందించారు. శిక్షణ కార్యక్రమాలతో అంగన్‌వాడీ కార్యకర్తల్లో మార్పు పనితనంలో మెరుగు చూపించాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 సంవత్సరాల లోపు పిల్లలందరికి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్లు ఇప్పించి వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నూరుశాతం చేయించాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. ముందుగా సీడీపీఓ ఇవాంజెలిన్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ వర్కర్ ట్రైనింగ్ భాగా నేర్చుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనితనం మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, డీర్పీలు ఉష శేషారెడ్డి, రామారావు, శ్రీనివాసరావు, జి.పద్మావతి, కే.శ్రీదేవి, మద్దిపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, గుండ్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, సూపర్‌వైజర్లు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# విశిష్ట సంఖ్య పొందడంపై రైతులకు అవగాహన

**- అసిస్టెంట్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్**



**రాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
గిద్దలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు డి బాలాజీ నాయక్ రైతు విశిష్ట సంఖ్యపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. రాచర్ల మండలంలోని పలు గ్రామాల రైతులతో ఆయన సమావేశమై రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందితేనే ప్రభుత్వ పథకాలు పొందుతారని లేకపోతే ప్రభుత్వ పథకాలు పొందలేరని అన్నారు. ఈ గుర్తింపు సంఖ్య పొందడం ద్వారా రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం ఈ సంఖ్యలో ఉంటుందని ఆ సంఖ్య ఆధారంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు, పరిహారం తదితర పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ సంఖ్య పొందకపోతే పై సూచించిన ఏ పథకాలు రైతులకు వర్తించవన్నారు. కాబట్టి రైతులు ఈ విషయాన్ని గమనించి తమ సంబంధించిన పాస్ పుస్తకం లేదా 1బి, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరు మరియు ఆధార్ నెంబరు తీసుకుని గ్రామంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేస్తే వారు తమ పేర్లు నమోదు చేసి రైతు విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. భూములు ఉన్న ప్రతి రైతు ఈ విషయాన్ని గమనించి వెంటనే సంబంధిత ధృవీకరణ పత్రాలతో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. పేర్లు నమోదు చేయించుకుని రైతు విశిష్ట సంఖ్యను పొందకపోతే ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్, గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

**- హెచ్‌ఎం సుధాకర్ రావు**



**రాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**
విద్యార్థులు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు బివి సుధాకర్ రావు అన్నారు. చిన్ని ఎడ్యుకేషనల్ సొసైటీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆకవీడు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, దాత పిల్లలమర్రి కుమార్ తన స్వంత నిధులతో ఆకవీడుహైస్కూల్ విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని సమకూర్చగా ఆయన విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, దాతలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోట్ పుస్తకాలు, పరీక్ష సామాగ్రి, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇలా వివిధ రకాలుగా అందజేస్తున్నారని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలు చేపడుతున్న సేవాసంస్థ ప్రినిధులకు దాతలకు తమ పాఠశాల తరపున అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. పేద, ప్రజలకు, పేద విద్యార్థులకు పాఠశాలల అభివృద్ధికి సేవా సంస్థ ప్రతినిదులు, దాతలు తమ సహాయ సహకారాలు నిరంతరం కొనసాగించాలని ఆయన కోరారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని, భవిష్యత్తులో చదవబోయే చదువులకు సిద్ధపడాలని ఆయన తెలిపారు. త్వరలో జరుగబోయే 10వ తరగతి పరీక్షల్లో పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులవ్వాలని అందుకొరకు ఇప్పటినుండి కష్టపడి చదవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాచర్ల హైస్కూల్‌లో ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటు

**- మండల విద్యాశాఖాధికారులు గిరిధర్ శర్మ, శివకోటేశ్వరరావు**







**రాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రాచర్ల (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల) హైస్కూల్‌లో ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు వి.గిరిధర్ శర్మ, ఏ శివకోటేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఈ యూనిట్ ద్వారా ఎన్‌సిసి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఈ యూనిట్‌కు కేర్‌టేకర్‌గా కెవి రమణారెడ్డి (ఎస్‌ఏ) వ్యవహరిస్తారన్నారు. పశ్చిమ ప్రకాశంలో వెనుకబడిన ప్రాంతమైన రాచర్లలో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తే ఎంతోమంది విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని ఈ ప్రాజెక్టు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా విద్యార్థులు పొందే అవకాశం ఉందని కాబట్టి ఎన్‌సిసి యూనిట్ మంజూరు చేయించాలని స్థానిక నాయకులతో కలిసి తాము, రాచర్ల జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బిఎల్ రామానాయక్, స్థానిక సర్పంచ్ సగినాల రాములమ్మ తదితరులు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డిని కోరామని మా కోరికను మన్నించి వెంటనే తమ మండలానికి వారు ఎన్‌సిసి యూనిట్‌ను మంజూరు చేయించారని అన్నారు. ప్రస్తుతం జిల్లా అంతటికి నాలుగు ఎన్‌సిసి యూనిట్లు మంజూరు కాగా వాటిలో మన రాచర్ల మండలం కూడా ఉండడం విశేషం అని వారన్నారు. ఇంత చిన్న మండలంలో ఎన్‌సిసి యూనిట్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందని, ఎన్‌సిసి అధికారులు వెనుకబడిన ప్రాంతమైన రాచర్లను గుర్తించి ఎంపిక చేయడం గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి ఎన్‌సిసి యూనిట్ మంజూరు కావడం మామూలు విషయం కాదని కేవలం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యమని అన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు ఎన్‌సిసి ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని కూడా వారు తెలిపారు. రాచర్ల మండలానికి ఎన్‌సిసి యూనిట్ మంజూరు చేయించిన నాయకులకు, అధికారులకు, స్థానిక పెద్దలకు తాము ధన్యవాదాలు తెలుపుతున్నామని వారు అన్నారు.


# నల్లమల అడవులకు నిప్పు - కాలిపోతున్న అడవి

**- మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక, అటవీశాఖ సిబ్బంది**



**రాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
నల్లమల అటవీ ప్రాంతం గుండ్లకమ్మ రేంజ్ అంబవరం అడవులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అటవీ ప్రాంతం మంటలకు ఆహుతి అయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు తక్షణమే అటవీ ప్రాంతానికి చేరుకొని మంటలను ఆర్పివేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశారు. అటవీ ప్రాంతంలో గేదెలను మేపుకునేవారు, గొర్రెలకాపరులు తమ గేదెలకు, గొర్రెలకు పశుగ్రాసం కొరకు అడవికి నిప్పంటించారని అటవీశాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో కొద్దిపాటి నిప్పు రాసుకోవడంతో అటవీ ప్రాంతమంతా ఎండుముఖం పట్టడంతో మంటలు ఎగిసిపడి అడవి అంతటికి రాసుకుంది. అడవులకు నిప్పంటుకుని మంటలు ఎగిసి పడుతుండడంతో రంగస్వామి దేవస్థానానికి వెళ్ళి వచ్చే భక్తులు భయాందోళనకు గురైనట్లు తెలిసింది. ఈ సంఘటనపై అటవీశాఖ డిఆర్‌ఓ నాయక్‌ను వివరణ కోరగా మంటలు అంటుకుంది వాస్తవమేనని తమ సిబ్బంది, అగ్నిమాపక కేంద్రం సిబ్బందితో కలిసి మంటలు ఆర్పే కార్యక్రమం చేపట్టారని అవసరమైతే ఈ రాత్రంతా అక్కడే ఉండి మంటలను ఆర్పడం జరుగుతుందన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం



**జరుగుమల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన జరుగుమల్లి ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్త జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నాల్గో రోజుకు చేరుకుంది ఈ రోజు సెక్షన్‌లో భాగంగా పిల్లల బాగోగులను గుర్తించడం అభివృద్ధి పరచడం, కృత్యాదారంగా ఎలా బోధించారో తెలపడం అయింది. దీనిలో భాగంగా పిల్లలో ఆనందం భాగా కోపం భయం లాంటి అనుభూతులను చార్టుల పైన వ్రాసి వివరించడమైంది. అంగన్‌వాడీ సెంటర్లో పిల్లల పుట్టిన రోజు వేడుకలు ఎలా చేయాలి మంచి అలవాట్లను ఎలా పెంపొందించాలి మట్టితో బొమ్మలు స్థానికంగా లభించే వనరులను ఎలా ఉపయోగించాలి అని కృత్యాల ద్వారా వివరించడం జరిగింది. కోర్సు డైరక్టర్, మండల విద్యాశాఖాధికారులు వి.నాగేంద్ర వర్ధన్ డి.శ్రీనివాసరావు చేతుల మీదుగా శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ కనబరుస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు ప్రధానం చేయడమైంది. ఈ శిక్షణా కార్యక్రమంలో అంగన్‌శాడీ సూపర్‌వైజర్లు, రిసోర్సు పర్సన్లు ఎం.నాగేశ్వరరావు, వి.బ్రహ్మయ్య, పి.వెంకటేశ్వర్లు, పి.భారతి, ఎల్.లావణ్య పాల్గొన్నారు.

